సాక్షి వనపర్తి

సోమవారం၊ 16၊ అక్టోబర్၊ 2023



జోగులాంబ.. నమోస్తుతే

అలంపూర్ ఆలయాల్లో ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 12లో ▸



సామాజిక కార్యకర్తగా మారాలి

ప్రతి ఉపాధ్యాయుడు ఓ సామాజిక కార్యకర్తలా మారాలని ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్ అన్నారు.

వివరాలు 12లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.2 /21.2

మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. రాత్రి కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

వనపర్తి: ప్రభుత్వ అధికారులు **ఎన్నికల** విధుల్లో ఉన్నందున సోమవారం **కలెక్టరేట్‌లో** నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తు**న్నట్లు** కలెక్టర్ తేజస్ పవార్ ఆదివారం ఒక **ప్రకటనలో** తెలిపారు. అర్జీదారులు కలెక్టరేట్**కు వచ్చి** ఇబ్బందులు పడొద్దని పేర్కొన్నారు.

సీఆర్పీఎఫ్ మహిళా జవాన్ల బైక్ ర్యాలీ




కొత్తకోట: రాష్ట్రీయ ఏక్తాదివాస్‌లో భాగంగా సీఆర్పీఎఫ్ మహిళా అధికారులు ఆదివారం పట్టణంలో 70 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 5న కన్యాకుమారిలో ప్రారంభమైన ర్యాలీ ఈ నెల 31న గుజరాత్‌లోని కవాడియాకు చేరుకుంటుందని.. ఐక్యమత్యాన్ని చాటేందుకు 140 మంది మహిళా జవాన్లు 70 బైక్‌లతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండర్ సుమ వివరించారు. బైక్ ర్యాలీకి పట్టణంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ర్యాలీలో భార్గవి, సింధున, సునీల్, శ్రీరంగన్‌తో పాటు మహిళా సీఆర్పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనూ బీజేపీదే అధికారం



ఆత్మకూర్: కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని.. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని పార్టీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని బాలకిష్టాపూర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని.. ప్రపంచ దేశాలన్నీ భారత్‌వైపు చూస్తున్నాయన్నారు. బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని.. ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని వివరించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు జలంధర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ రేచింతల శ్రీను, జిల్లాకార్యదర్శి అశోక్ కుమార్‌జీ, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



వనపర్తి: జిల్లావ్యాప్తంగా ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాకేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతిదేవి అమ్మవారు పార్వతీ దేవిగా దర్శనమిచ్చారు. వల్లభ్‌నగర్, సంతబజార్, పాతబజార్, రామాలయంకాలని, పెద్దమ్మగుడికాలని, వెంగళ్‌రావుకాలనీతో పాటు వివిధ ప్రాంతాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. వినాయక మండపాలకు దీటుగా ఏర్పాట్లు చేయడం కనిపించింది.

జాతీయస్థాయిలో రాణించేలా ఆడాలి

కల్వకుర్తి టౌన్: ఎంచుకున్న క్రీడల్లో జాతీయస్థాయిలో రాణించేలా ఆడాలని బ్యాడ్మింటన్ అంతర్జాతీయ క్రీడాకారిణి దీప్తి అన్నారు. ఆదివారం పట్టణంలోని అక్షరవనంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ కార్యక్రమంలో అంతర్జాతీయ హాకీ ప్లేయర్ నిజాముద్దీన్‌తో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు వారికి స్థానికంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. క్రీడల్లో రాణించటంతో మంచి గుర్తింపు వస్తుందన్నారు. పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ఎలాంటి క్రీడల్లోనైనా రాణించటంతో శారీరకంగా మంచి ఫిట్‌నెస్ సాధించవచ్చన్నారు. ఒకేరోజు నిర్వహించిన బ్యాడ్మింటన్ క్రీడలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ సత్యం, వందేమాతం జిల్లా అధ్యక్షుడు జగన్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.


ఆరింట ఎవరు..?

కాంగ్రెస్ తొలి జాబితాలో 8 మందికి చోటు

- మహబూబ్‌నగర్ పరిధిలో ఐదు పెండింగ్
- నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో ఒక స్థానం..
- ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో బహుముఖ పోటీ..
- అసమ్మతి భయంతో ఆచితూచి వ్యవహరిస్తున్న అధిష్టానం
- 2 రోజుల్లో రెండో విడత జాబితా ప్రకటించే అవకాశం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:

కాంగి'రేసు'లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 55 అసెంబ్లీ స్థానాల్లో బరిలో నిలిచే అభ్యర్థులను ఏఐసీసీ ప్రకటించింది. ఇందులో ఉమ్మడి పాలమూరు నుంచి ఎనిమిది మందికి చోటు దక్కింది. ఇంకా ఆరు స్థానాలు పెండింగ్‌లో ఉండగా.. ఎవరెవరికి పోటీ చేసే అవకాశం దక్కుతుందనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వీటికి సంబంధించి అభ్యర్థుల ఖరారు ప్రక్రియ పూర్తయినప్పటికీ.. బహుముఖ పోటీ నేపథ్యంలో అసమ్మతి పెల్లుబికుతుందనే భయంతో ఆచితూచి వ్యవహరిస్తూ పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. మరో రెండు, మూడు రోజుల్లో రెండో విడత జాబితా ప్రకటించనున్నట్లు ఏఐసీసీ పెద్దలు వెల్లడించగా.. ఆయా స్థానాలపై సస్పెన్స్ వీడనున్నట్లు తెలుస్తోంది.



వర్గాల వారీగా ఇలా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో 12 జనరల్ కాగా.. రెండు (అచ్చంపేట, అలంపూర్) ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు. తొలివిడతలో కాంగ్రెస్ ప్రకటించిన ఎనిమిది స్థానాల అభ్యర్థులను పరిశీలిస్తే ఆరు జనరల్ స్థానాల్లో ముగ్గురు రెడ్డి, ఒకరు వెలమతోపాటు బీసీ వర్గాలకు చెందిన ఇద్దరికి అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. రెండు రిజర్వ్‌డ్ స్థానాల్లో ఇద్దరు ఎస్సీ అభ్యర్థులను కేటాయించారు.

పెండింగ్ స్థానాలు..

మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, వనపర్తి

'మహబూబ్‌నగర్'లోనే ఐదు పెండింగ్..

ఉమ్మడి పాలమూరులో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు కాగా.. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో ఏడు (మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, కొడంగల్, షాద్‌నగర్), నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఏడు (నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల, అలంపూర్) ఉన్నాయి. కాంగ్రెస్ తొలి విడతలో ఎనిమిది స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. పెండింగ్‌లో పెట్టిన ఆరు స్థానాల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ నియోజకవర్గంలోని వనపర్తితోపాటు మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో అధికంగా ఐదు (మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట) సెగ్మెంట్లు ఉండడం హాట్‌టాపిక్‌గా మారింది. ఆయా నియోజకవర్గాల్లో ఇద్దరికి మించి అభ్యర్థులు పోటీ పడుతుండడం.. సామాజిక వర్గ సమీకరణలు తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఎవరికి అవకాశం కల్పిస్తారనే దానిపై పలు ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

కొత్తగా చేరిన వారికే పెద్దపీట..

మారిన రాజకీయ పరిణామాల క్రమంలో ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతలకు తొలిజాబితాలో పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది. బీఆర్‌ఎస్ నుంచి సస్పెన్షన్ వేటు పడిన తర్వాత కొల్లాపూర్‌కు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. ఆయనతోపాటు నాగర్‌కర్నూల్‌కు చెందిన ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేష్ రెడ్డి, గద్వాలకు చెందిన జెడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య చేయి అందుకున్నారు. ఆ తర్వాత కల్వకుర్తి చెందిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరగా.. వీరందరికి తొలి జాబితాలోనే సీట్లు కేటాయించడం విశేషం.

కాంగ్రెస్ పాతకాపులు ముగ్గురే..

ఈ సారి తొలి విడతలో ప్రకటించిన అభ్యర్థులు, గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వారిని పరిశీలిస్తే.. రేవంత్‌రెడ్డి (కొడంగల్), చిక్కుడు వంశీకృష్ణ (అచ్చంపేట), సంపత్ (అలంపూర్) మాత్రమే ఉన్నారు. కొల్లాపూర్‌లో జూపల్లి కృష్ణారావు బీఆర్‌ఎస్ నుంచి, షాద్‌నగర్‌లో వీర్లపల్లి శంకర్ బీఎస్పీ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. కసిరెడ్డి నారాయణరెడ్డి (కల్వకుర్తి) 2014లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), సరితా తిరుపతయ్య (గద్వాల) ఈ ఎన్నికల్లో తొలిసారిగా బరిలో నిలవనున్నారు. 1999లో జూపల్లి కాంగ్రెస్ నుంచే రాజకీయాల్లోకి వచ్చాడు. ఆ ఎన్నికలో గెలుపొందారు. 2004లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలిచారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉధృతంగా సాగుతున్న క్రమంలో 2011లో కాంగ్రెస్‌కు, మంత్రి, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్)లో చేరారు. బీఆర్‌ఎస్ నుంచి 2012 ఉప ఎన్నికలు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014 ఎన్నికల్లో గెలుపొందారు. 2018లో ఓటమి పాలయ్యారు.

జంగ్ తెలంగాణ

వారి దారెటు..

కాంగ్రెస్‌లో పలువురు నేతల చేరికల క్రమంలో ప్రధానంగా నాగర్‌కర్నూల్, కొల్లాపూర్‌కు సంబంధించి టికెట్ ఆశిస్తున్న సీనియర్ నేతలు, వారి అనుచరుల్లో అసంతృప్తి పెల్లుబికింది. కూచుకుళ్లపై నాగం జనార్దన్‌రెడ్డి, జూపల్లిపై చింతలపల్లి జగదీశ్వర్‌రావు నిత్యం ఫైర్ అవుతూ వచ్చారు. నాగం వర్గీయులు ఇటీవల గాంధీ భవన్ వద్ద పెద్ద ఎత్తున నిరసన సైతం తెలిపారు. సర్వేల ఆధారంగానే టికెట్లు కేటాయిస్తామని.. ఇంకా టికెట్లు ఖరారు కాలేదని నేతలు సముదాయించడంతో వెనుదిరిగారు. ప్రస్తుతం కొల్లాపూర్ టికెట్ జూపల్లి, నాగర్‌కర్నూల్ టికెట్ కూచుకుళ్లకు కేటాయించిన నేపథ్యంలో నాగం, చింతలపల్లి వర్గీయులు గుర్రుగా ఉన్నారు. కొల్లాపూర్ కాంగ్రెస్ కార్యాలయంలో జగదీశ్వర్‌రావు అనుచరులు ఫ్లెక్సీలు చించివేశారు. తాను ఢిల్లీ నుంచి వస్తున్నానని, ఆ తర్వాత నిర్ణయం తీసుకుందామని జగదీశ్వర్‌రావు వారిని వారించినట్లు తెలుస్తోంది.

అలంపూర్ మినహా..

ఉమ్మడి జిల్లాలో 13 మంది బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీఫారాలు

- తెలంగాణ భవన్, ప్రగతిభవన్‌లో అందజేసిన సీఎం కేసీఆర్
- మేనిఫెస్టో వెల్లడితో 'గులాబీ'లో జోష్
- పలు నియోజకవర్గాల్లో సంబరాలు
- 2, 3 రోజుల్లో అలంపూర్‌పై వీడనున్న సందిగ్ధత



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలవనున్న బీఆర్‌ఎస్ అభ్యర్థులకు సీఎం కేసీఆర్ ఆదివారం బీఫారాలను స్వయంగా అందజేశారు. తొలి విడతలో మధ్యాహ్నం 51 మందికి, రాత్రి 18 మందికి బీఫారాలు ఇవ్వగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క అలంపూర్ స్థానానికి మినహాయించి మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు బీఫారాలను అందించారు. అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అబ్రహంకు మళ్లీ టికెట్‌ను ప్రకటించినా, ఇటీవల ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి వర్గీయుల ఆందోళన నేపథ్యంలో సందిగ్ధత నెలకొన్నట్లు తెలుస్తోంది. మరో రెండు, మూడు రోజుల్లో అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించి అభ్యర్థికి బీఫారాన్ని అందించనున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మిగిలిన ఎమ్మెల్యేలకు పార్టీ బీఫారాలు లభించడంతో పాటు మేనిఫెస్టో ప్రకటనతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

⇨ అసెంబ్లీ ఎన్నికల సందర్భం గా అన్ని పార్టీల కంటే ముందుగా అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్.. మేనిఫెస్టోను సైతం ముందస్తుగానే విడుదల చేసింది. ఈసారి మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఇంటికి సన్నబియ్యాన్ని అందజేస్తామని ప్రకటించింది. తెల్లరేషన్‌కార్డు ఉన్న వారికి రూ. 5 లక్షల జీవితబీమా కల్పిస్తామని చెప్పింది. ఆసరా పెన్షన్లను మరో రూ. వెయ్యి పెంచడంతో పాటు వచ్చే ఐదేళ్లలో రూ. 5వేల పెన్షన్ అందజేయనున్నట్టు ప్రకటించింది. అర్హులైన మహిళలకు నెలకు రూ.3 వేల జీవనభృతి, రూ.400కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పథకం పరిధి రూ. 5 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంపు వంటి హామీలను అమలుచేస్తామని బీఆర్‌ఎస్ ప్రకటించింది. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో విడుదల కావడంతో నేటి నుంచి ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది.

మూడోసారి అధికారంలోకి..



సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోతో ప్రతిపక్ష పార్టీల దిమ్మదిరగడం ఖాయం. సాయం కోసం ఎదురుచూస్తున్న అన్ని వర్గాలకు ఆర్థిక చేయూతనందించేలా.. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను రాష్ట్ర ఆర్థిక స్థితిని గుర్తుంచుకుని రూపొందించారు. తెల్లరేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, రైతుబంధు పెట్టుబడిసాయం పెంపు, మహిళలకు ఆర్థిక భరోసా బీఆర్‌ఎస్‌ను రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి తీసుకువస్తాయి.

- నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి

జనం గుండెల్లో కేసీఆర్



సీఎం కేసీఆర్ అంటేనే నమ్మకానికి మారు పేరు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను నెరవేర్చినందుకే జనం గుండెల్లో గూడు కట్టుకున్నారు. సంక్షేమ పథకాలకు తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచేలా చేసిన చరిత్ర కేసీఆర్‌కే దక్కుతుంది. వరుసగా మూడోసారి సీఎం చేతులమీదుగా బీఫారం అందుకోవడం సంతోషంగా ఉంది. ఆయన ఆశీర్వాదం, ప్రజల దీవెనలతో ఈసారి లక్ష ఓట్లకు పైగా మెజార్టీతో ఘన విజయం సాధిస్తా. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశా. వచ్చే ఏడాదికి పాలమూరు ప్రాజెక్టుతో జిల్లాను సస్యశ్యామలం చేస్తాను. తెలంగాణకు కేసీఆర్‌రే శ్రీరామరక్ష. కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి ధీమా, ఆసరా పింఛన్లు, రైతుబంధు సాయం పెంపు, కేసీఆర్ ఆరోగ్య రక్ష- ఆరోగ్యశ్రీ రూ.15 లక్షలు, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా పేద మహిళకు నెల రూ.3 వేల భృతితోపాటు రూ.400కే సిలిండర్ మేనిఫెస్టోలో పొందుపర్చడం సంక్షేమంపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనం.

- శ్రీనివాస్‌గౌడ్, ఎక్సైజ్‌శాఖ మంత్రి

సంక్షేమమే అజెండాగా.. మేనిఫెస్టో 10లో

జడ్చర్ల, మక్తల్ వయా 'పేట'..!

- ఎర్రశేఖర్ లింక్‌తో మూడు స్థానాలపై ప్రభావం
- సామాజిక వర్గ లెక్కలతో ఊహాగానాలు
- వనపర్తిలో మేఘారెడ్డి వర్సెస్ చిన్నారెడ్డి
- మక్తల్, నారాయణపేటలో ఏదో ఒక స్థానం బీసీకి..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ సీట్ల లొల్లి కాంగ్రెస్ అధిష్టానాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు తెలుస్తోంది. జడ్చర్ల, మక్తల్, నారాయణపేట లెక్కలు తేలకపోవడం.. ముఖ్య నేతలు హస్తిన బాటపట్టి ఫిర్యాదులు చేయడంతో నాగర్‌కర్నూల్ ఎంపీ పరిధిలోని వనపర్తితో పాటు మహబూబ్‌నగర్ పరిధిలోని ఐదు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించలేదని పార్టీలోని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. జడ్చర్ల అభ్యర్థిగా అనిరుధ్‌రెడ్డి ఖరారైనప్పటికీ.. నారాయణపేటలో ఎర్రశేఖర్ లింక్‌తో ఈ స్థానాన్ని పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. ఎర్రశేఖర్‌ను నారాయణపేట నుంచి బరిలో దింపేలా అధిష్టానం యోచన చేస్తున్న క్రమంలో కుంభం శివకుమార్‌రెడ్డి సైతం పోటీలో ఉన్నట్లు స్పష్టం చేయడం గందరగోళానికి దారి తీసినట్లు గ్రహించిన ముఖ్య నేతలు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. సామాజిక వర్గాల వారీగా లెక్క తీసిన పెద్దలు నారాయణపేట, మక్తల్ అభ్యర్థులను సైతం ఖరారు చేశారని.. అయితే అసమ్మతి జ్వాలలు ఎగిసిపడకుండా.. పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో గద్వాల, మహబూబ్‌నగర్ ఎంపీ పరిధిలో షాద్‌నగర్ స్థానాన్ని బీసీలకు కేటాయించారు. అదేవిధంగా మక్తల్, నారాయణపేటలో ఏదేని ఒక స్థానాన్ని బీసీ వర్గ నేతలకు కేటాయించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు వనపర్తిలో మాజీ మంత్రి చిన్నారెడ్డి, ఎంపీపీ మేఘారెడ్డి మధ్య పోటాపోటీ నెలకొంది.

దేవరకద్ర, మహబూబ్‌నగర్‌పై మీమాంస..

దేవరకద్రలో పోటీపడుతున్న డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, కొండా ప్రశాంత్‌రెడ్డికి తోడు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన సీతా దయాకర్‌రెడ్డి తన కుమారుడికి టికెట్ ఆశిస్తుండడం ఎంపిక క్లిష్టంగా మారింది. ఈ స్థానంపై కాంగ్రెస్ పెద్దల్లో మీమాంస కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ఒబేదుల్లా కొత్వాల్, సంజీవ్ ముదిరాజ్ టికెట్ కోసం పోటీపడుతున్నారు. ఇటీవల బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి హస్తం గూటికి చేరగా, ఆయన సైతం టికెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ బీసీ, స్థానికత అంశానికి ప్రాధాన్యం ఏర్పడగా అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. బీసీలకు టికెట్ల కేటాయింపులో రాష్ట్రంలో ఏమైనా సమీకరణలు మారితే ఈ నియోజకవర్గంలో ఆ వర్గానికి దక్కే అవకాశమున్నట్లు సీనియర్ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

18న చలో చెరుకు ఫ్యాక్టరీ

ఆత్మకూర్: చెరుకు కటింగ్, రవాణా అన్నిపోను టన్నుకు రూ.3 వేలు ధర చెల్లించాలని కృష్ణవేణి చెరుకు రైతుసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న, ఉపాధ్యక్షుడు వాసారెడ్డి, నర్సింహులు, ఆంజనేయులు, ప్రధానకార్యదర్శి శివుడు కోరారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో సంఘం ఉమ్మడి జిల్లా గ్రామకమిటీ నాయకులు, చెరుకు రైతులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఆరేళ్లుగా గిట్టుబాటు ధర అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ విషయమై ఈ నెల 18న తలపెట్టిన చలో చెరుకు ఫ్యాక్టరీ కార్యక్రమానికి రైతులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. వేరు పురుగు నష్టపరిహారం ఎకరాకు రూ.35 వేలు చెల్లించాలని, కోతకు సరిపడా కార్మికులను రప్పించాలని, అధిక దిగుబడులు వచ్చే విత్తనం సరఫరా చేయాలని, చెరుకు రవాణా సమయంలో జరిగే ప్రమాదాలకు బాధ్యత వహించాలని, పెండింగ్ బిల్లులు, డ్రిప్ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జోన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షులుగా తిరుపతయ్య, సుధాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా అరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా రవీందర్‌రెడ్డి, పాషా, కోశాధికారిగా రాజశేఖర్‌రెడ్డితో పాటు 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, చెరుకు రైతులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు, చెరుకు రైతులు

జెన్కోలో బతుకమ్మ సంబరాలు

ఆత్మకూర్: పట్టణంలోని జెన్కో క్వార్టర్స్‌లో ఆదివారం రాత్రి బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డీఈ రూపేష్, ఏడీఈలు రవిశంకర్, రజనీకాంత్, రామలింగేశ్వర్‌రెడ్డి, ఏఈలు శివకుమార్, విజయ్‌కుమార్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలు

అరాచక పాలనపై తిరగబడదాం : కాంగ్రెస్

అమరచింత: ఇచ్చిన హామీలు విస్మరించి ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తిరగబడాలని టీపీసీసీ కల్లు గీత సెల్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ పిలుపునిచ్చారు. 'తిరగబడదాం.. తరిమికొడదాం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని తూక్యానాయక్ తండాలో ఇల్లిల్లూ తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేసే ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరోమారు ప్రజలను మోసం చేయడానికి కొత్త మేనిఫెస్టోతో వస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో నిర్మించిన ప్రాజెక్టులకు మరమ్మతులు చేయలేని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం పేరిట తమ ఇంటి ఆదాయాన్ని పెంచుకుందని ఆరోపించారు. నియోజకవర్గంలో ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని.. మరమ్మతులు చేయించలేని స్థితిలో ప్రజాప్రతినిధులు ఉండటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్, నాయకులు అరుణ్‌కుమార్, హన్మంతునాయక్, తౌఫీక్, పోసిరిగారి విష్ణు, నాగునాయక్, ప్రకాశం, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో నాగరాజుగౌడ్

బీఆర్‌ఎస్‌వి అమలుకాని హామీలే..

అమరచింత: ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన ఎన్నికల హామీలను 9 ఏళ్లు గడిచినా నేటికీ అమలు చేయలేదని.. కొత్త హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని బీఆర్‌ఎస్ మేనిఫెస్టోపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన రూ.లక్ష పంట రుణమాఫీ నేటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని.. వడ్డీకూడా మాఫీ చేస్తామని మాట తప్పారని ఆరోపించారు. దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల హామీలు అటకెక్కాయని తెలిపారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానన్న మాట నిలబెట్టుకోలేక పోయారని.. నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారకులయ్యారన్నారు. నిరుద్యోగి ప్రవళికది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. రైతుబంధు మేనిఫెస్టోలో లేకున్నా అమలు చేశామని సీఎం గొప్పలు చెబుతున్నారని.. వ్యవసాయ ఉపకరణాలపై గత ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీని ఎత్తేసి రైతుబంధు ఇస్తున్నారని విమర్శించారు. పాలమూర్ ప్రాజెక్టు 9 ఏళ్లు దాటినా పూర్తి కాలేదని.. 34 పంపులకుగాను నార్లాపూర్ వద్ద ఒక పంపును మాత్రమే ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని.. వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, సహాయ కార్యదర్శి భాస్కర్, రవీందర్, రఘు, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయరాములు


సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫారాలు అందుకుంటున్న ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, లక్ష్మారెడ్డి, జైపాల్‌యాదవ్, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, అంజయ్యయాదవ్

సంక్షేమమే అజెండాగా.. మేనిఫెస్టో

బీఆర్‌ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రజలు, రైతుల సంక్షేమమే అజెండాగా ఉందని ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. ఈ మేనిఫెస్టోతో ప్రతిపక్ష పార్టీల నాయకులకు మైండ్ బ్లాక్ అయ్యిందని పేర్కొన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. – సాక్షి నెట్‌వర్క్

కేసీఆర్ వైపే చూస్తున్నారు..

సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోతో విపక్షాల గుండెలు జల్లుమంటున్నాయి. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం. హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ నేతృత్వంలో ప్రజాసంక్షేమం.. అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుంది. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఐదు గ్యారెంటీలకు దిక్కులేదు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరు. ప్రజలంతా కేసీఆర్ వైపు చూస్తున్నారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటి ధీమా అవుతుంది. – రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నారాయణపేట

సంక్షేమమే ధ్యేయంగా..

బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆదివారం ప్రకటించిన మేనిఫెస్టో అద్భుతంగా ఉంది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా మేనిఫెస్టోను రూపొందించారు. ఆసరా పింఛన్ల పెంపు, రైతుబంధు పెంపు, కేసీఆర్ బీమా, రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం, దివ్యాంగుల పింఛన్ల పెంపు వంటివి ప్రజల స్థితిగతులకు దగ్గరగా ఉన్నాయి. ప్రజల ఆదరణతో మరోసారి అధికారంలోకి వచ్చి మేనిఫెస్టోను నూటికి నూరు పాళ్లు అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతాం. – లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

దేశంలోనే నంబర్ సీఎం

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో ముచ్చటగా మూడోసారి సీఎం కావడం ఖాయం. ఈ మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు మైండు బ్లాక్ అయింది. సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు ఊహించని రీతిలో ఉన్నాయి. అన్ని పథకాలు పేదలు, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పెట్టినవే. ఈ పథకాలన్నీ ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేసి సీఎం కేసీఆర్ దేశంలోనే నంబర్ వన్ సీఎం అవుతారు. – చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, మక్తల్

చెప్పింది చేస్తారనే నమ్మకం

సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ మేనిఫెస్టో పేదల సంక్షేమానికి ప్రాధాన్యతగా నిలిచింది. రైతులు, మహిళలు, వృద్ధుల సంక్షేమం కోసం పెద్దపీట వేశారు. కేసీఆర్ అంటే ఒక నమ్మకం అని చెప్పింది చేస్తారనే భావన ప్రజల్లో ఉంది. గత పదేళ్లుగా ప్రజల పక్షాన నిలిచి వారి సంక్షేమం కోసం పని చేస్తున్న కేసీఆర్‌ను ప్రజలు నమ్ముతున్నారు. అదే నమ్మకంతో వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ విజయం సాధిస్తాం. – ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

విజయావకాశాలు రెట్టింపు

గతంలో దశాబ్దాలుగా ఉండి ఏ పాలకుడు చేయని విధంగా రూ.కోట్లతో కేసీఆర్, కేటీఆర్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా. చేసిన అభివృద్ధి పనులతో ఇప్పటికే విజయావకాశాలు మెండుగా ఉన్న తరుణంలో కేసీఆర్ ఆదివారం ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రజలకు మరింత నమ్మకం ఏర్పడి విజయావకాశాలు రెట్టింపు అయ్యాయి. కేసీఆర్ మేనిఫెస్టోతో ఇతర పార్టీలకు దిమ్మదిరిగే షాక్ తగిలింది. మేనిఫెస్టోతో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మూడోసారి సైతం తప్పక ఆశీర్వదిస్తారు. – పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొడంగల్

అన్నివర్గాలకు మేలు..

ప్రజల పరిస్థితులను అర్థం చేసుకున్న సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు మేలు చేసేలా మేనిఫెస్టో రూపొందించారు. ఇప్పటికే కొనసాగుతున్న 11 అద్భుతమైన పాలసీలను అమలు చేస్తూ.. కొత్త హామీలు అన్నివర్గాల ప్రజలకు మేలు చేసేలా ఉన్నాయి. ఈ పథకాలు పేదల ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయి. సబ్బండ వర్గాలను సంతోషపెట్టేలా ఈ పథకాలు ఉన్నాయి. కాంగ్రెస్ పథకాలను ప్రజలు విశ్వసించడం లేదని ఇప్పటికే తేటతెల్లమైంది. – గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే, అచ్చంపేట

మైండ్ బ్లాక్ అయ్యింది

సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్ అయ్యింది. భవిష్యత్‌లోనూ ఇలాంటి పథకాలను ఎవరూ ప్రకటించలేరు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన వ్యక్తి సీఎం కేసీఆర్. బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీల అమలే కాక.. మేనిఫెస్టోలో ప్రకటించని పథకాలను సైతం అమలు చేశాం. అన్నివర్గాల సంక్షేమం కోసం ప్రజారంజక పాలన అందించేందుకు మరిన్ని సంక్షేమ పథకాలను అమలుచేస్తాం. కల్వకుర్తిలో మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఎగురవేస్తాం. – జైపాల్‌యాదవ్, ఎమ్మెల్యే, కల్వకుర్తి

ప్రజారంజకమైన మేనిఫెస్టో

ఆత్మగౌరవం, స్వపరిపాలన కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేసి సాధించుకున్న రాష్ట్రం అదే నాయకుడి నేతృత్వంలో పదేళ్లుగా అన్ని రంగాల్లో పురోగమిస్తోంది. ముఖ్యంగా అట్టడుగు వర్గాల ప్రయోజనాలు, రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్. అందుకే ప్రజలు వరుసగా రెండుసార్లు సీఎం కేసీఆర్‌కు పట్టం కట్టారు. ఇప్పుడు మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఆ దిశగానే సీఎం కేసీఆర్ ప్రజారంజకమైన మేనిఫెస్టోను విడుదల చేశారు. ప్రజలు మరోసారి ఆశీర్వదించి సీఎం కేసీఆర్‌ను, గద్వాలలో నన్ను గెలిపించాలి. – బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల

చరిత్రలో నిలుస్తుంది

మాది పేదల సంక్షేమ ప్రభుత్వం. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం. ఇప్పుడు కొత్తగా ఇచ్చిన హామీలను కూడా నెరవేరుస్తాం. కాంగ్రెస్ మాదిరిగా కాకుండా.. ఆచరణ యోగ్యమైనవి మాత్రమే ఇచ్చాం. రైతుబంధును ఎకరాలకు రూ.16 వేలకు పెంచి మరోసారి కేసీఆర్ రైతు పక్షపాతి అని నిరూపించుకున్నారు. 50 ఏళ్లు నిండిన రైతులకు పింఛన్ అనేది దేశంలోని మొదటిసారి ప్రకటించిన ప్రభుత్వంగా బీఆర్‌ఎస్ సర్కారు పేరు చరిత్రలో నిలుస్తుంది. – బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొల్లాపూర్

ప్రతి ఇంటికి లబ్ధి

దేశంలో ఎక్కడా అమలు కాని రీతిలో తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఈ సైతం అన్ని వర్గాల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను రూపొందించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి లబ్ధి చేకూరింది. ఇక ముందు కూడా కొనసాగుతుంది. మళ్లీ బీఆర్‌ఎస్ రాష్ట్రంలో మూడోసారి అధికారం చేపడుతుంది. – మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్


సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫారాలు అందుకుంటున్న ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, ఎస్.రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థుల ప్రొఫైల్

కొడంగల్

పేరు : ఎనుముల రేవంత్‌రెడ్డి
భార్య పేరు : గీతారెడ్డి
కూతురు : నైనీశ– సత్యనారాయణరెడ్డి
తండ్రి పేరు : నర్సింహారెడ్డి
పుట్టిన తేదీ : 8.11.1969
పుట్టిన గ్రామం : కొండారెడ్డిపల్లి, వంగూరు మండలం (నాగర్‌కర్నూల్ జిల్లా)
చదువు : బీఏ
రాజకీయ ప్రస్థానం : మొదటిసారి మిడ్జిల్ జెడ్పీటీసీగా గెలుపొందారు. పదవిలో ఉండగానే పాలమూరు జిల్లా నుంచి ప్రాదేశిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా (స్వతంత్రం) పోటీ చేసి గెలుపొందారు. ఎమ్మెల్సీగా ఉండగానే కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2009లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి గురునాథ్‌రెడ్డిపై విజయం సాధించారు. 2014లో టీఆర్‌ఎస్ అభ్యర్థి గురునాథ్‌రెడ్డిపై 15 వేల ఓట్ల మెజారిటీతో రేవంత్‌రెడ్డి గెలిచారు. 2018లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి టీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం 2023లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొడంగల్ నుంచి పోటీ చేయనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అభ్యర్థుల జాబితాను ఆదివారం విడుదల చేసింది. రేవంత్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత పోటీ చేసిన అన్ని ఎన్నికల్లోనూ విజయం సాధించారు. 2018లో ఒక్కసారి మాత్రం కొడంగల్‌లో ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

కొల్లాపూర్

పేరు : జూపల్లి కృష్ణారావు
తల్లిదండ్రులు: జూపల్లి రత్నమ్మ, శేషగిరిరావు
స్వగ్రామం: పెద్దదగడ, చిన్నంబావి మండలం (వనపర్తి జిల్లా)
విద్యార్హత: బీఏ
వయస్సు : 69
భార్యపేరు : సుజన
కుమారులు: జూపల్లి వరుణ్‌రావు, అరుణ్‌రావు
రాజకీయాల్లోకి రాకముందు : బ్యాంకులో ప్రభుత్వ ఉద్యోగి. ఉద్యోగానికి రాజీనామా చేశాక రియల్ ఎస్టేట్ వ్యాపారం.
రాజకీయ ప్రవేశం : 1999లో క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. 1999లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో స్వతంత్ర అభ్యర్థిగా, 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2012 ఉప ఎన్నికల్లో, 2014 సార్వత్రిక ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు.
పదవులు : 2009లో పౌరసరఫరాల శాఖ మంత్రిగా, ఆ తర్వాత దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 2014లో మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా కొనసాగారు.

అచ్చంపేట

పేరు : చిక్కుడు వంశీకృష్ణ
తల్లిదండ్రులు : చిక్కుడు కిష్టమ్మ, బాలయ్య
పుట్టిన తేదీ : 12.09.1966
స్వస్థలం : ఎల్మపల్లి (నాగర్‌కర్నూల్ జిల్లా)
చదువు : ఎంబీబీఎస్, ఎంఎస్, జనరల్ సర్జన్
భార్య : డాక్టర్ అనురాధ
పిల్లలు : కొడుకు యశ్వంత్, కూతురు యుక్తముఖి
రాజకీయ ప్రవేశం : 1994లో బీఎస్పీ నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. మొదటిసారి 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.
పదవులు : 2004లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తిరిగి 2009, 2014, 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు.

అలంపూర్

పేరు : సందేపోగు ఆనందరావు సంపత్‌కుమార్
తండ్రిదండ్రులు : ఎస్‌ఏ లూషమ్మ, ఎస్‌ఏ ఆనంద్‌రావు
పుట్టిన తేదీ : 20.11.1972
విద్యాభ్యాసం : ఎంబీఏ, పీహెచ్‌డీ
స్వగ్రామం : చిన్నతాండ్రపాడు (జోగుళాంబ గద్వాల జిల్లా)
భార్య : మహాలక్ష్మి
పిల్లలు : కుమారుడు– దీపక్ ప్రజ్ఞ, కుమార్తె– ప్రణయ దీపిక
స్ఫూర్తి : రాజీవ్‌గాంధీ స్ఫూర్తితో రాజకీయాల్లోకి..
రాజకీయ అరంగ్రేటం : ఎన్ఎస్‌యూఐలో విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా, ఏఐసీసీ కార్యదర్శిగా, ఆర్డీఎస్ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిగా, తెలంగాణ జాగరణ సేనా రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నిక. 2018లో ఓటమి.

గద్వాల

పేరు : కె.సరిత
భర్త : కె.తిరుపతయ్య
తల్లిదండ్రులు : చంద్రకళ, కృష్ణయ్య
విద్యార్హత : బీఎస్సీ (మైక్రోబయాలజీ)
పుట్టిన తేదీ : 05.07.1983
స్ఫూర్తి: తండ్రి కృష్ణయ్య
పదవులు : జెడ్పీటీసీ సభ్యురాలు, జెడ్పీచైర్‌పర్సన్ (గద్వాల)
పిల్లలు : కార్తీక్, అనిల్
రాజకీయ అరంగ్రేటం : తొలిసారిగా 2019 మానవపాడు జెడ్పీటీసీగా గెలుపొందారు. ప్రస్తుతం జెడ్పీ చైర్ పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరి తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు.

నాగర్‌కర్నూల్

పేరు : కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి
తల్లిదండ్రులు : సౌభాగ్య, కూచకుళ్ల దామోదర్‌రెడ్డి (ఎమ్మెల్సీ)
పుట్టిన తేదీ : 23.03.1973
విద్యార్హత : ఎండీఎస్ (మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జన్)
స్వగ్రామం : తూడుకుర్తి (నాగర్‌కర్నూల్ మండలం)
వృత్తి : డాక్టర్
భార్య: సరిత
పిల్లలు: రుత్విక్‌రెడ్డి, రిషిత్‌రెడ్డి
రాజకీయ అనుభవం : ప్రస్తుతం డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్‌గా కొనసాగుతున్నారు. మొదటిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు.

కల్వకుర్తి

పేరు : కసిరెడ్డి నారాయణరెడ్డి
భార్య : మాధవి
కుమారులు : దుర్గాప్రసాద్‌రెడ్డి, కృష్ణవంశీధర్‌రెడ్డి
పుట్టిన తేదీ : 18.01.1964
పుట్టిన గ్రామం : ఖానాపూర్ (రంగారెడ్డి జిల్లా)
చదువు : మెకానికల్ ఇంజినీరింగ్ (ఏఎంఐఎంఈ)
రాజకీయ ప్రస్థానం : 2014 ఎన్నికల్లో ఆటో గుర్తుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2016లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీఆర్‌ఎస్ నుంచి పోటీచేసి గెలుపొందారు. 2022లో తిరిగి అదే స్థానం నుంచి పోటీచేసి రెండోసారి ఎమ్మెల్సీగా గెలుపొందారు. తాజాగా కాంగ్రెస్ పార్టీలో చేరారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


ఈటె రాజు (ఫైల్)

మదనాపురం: మండలంలోని కొత్తపల్లికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లికి చెందిన ఈటె రాజు (30) భార్య మమత రెండేళ్లుగా భర్తను వదిలేసి తన పిల్లతో కలిసి పుట్టింట్లో ఉంటుంది. దీంతో మనస్తాపం చెంది ఈనెల 4వ తేదీన గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నిందితులకు రిమాండ్

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని బోడబండ తండాకు చెందిన దేశవత్ శ్రీను, మురళీ మోహన్, ముడావత్ కుమార్, ముడావత్ బాలజీ, దేశవత్ గోపాల్, ఎల్లూరుకు చెందిన సతీష్ కుమార్ కలిసి సమీపంలోని మేఘా కంపెనీలోని వస్తువులను ఆదివారం చోరీ చేశారు. కంపెనీ వారి ఫిర్యాదు మేరకు వారిని పట్టుకుని కేసు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా.. మెజిస్ట్రేట్ వారిని రిమాండ్‌కు తరలించారని ఎస్‌ఐ బాలవెంకటరమణ తెలియజేశారు.

వృద్ధురాలి దుర్మరణం

కోడేరు: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని తీగలపల్లికి చెందిన ఈశ్వరమ్మ (60) జనుంపల్లి శివారు మంత్రాలమ్మ ఆలయం వద్ద రోడ్డుపై మొక్కజొన్న ఆరబోసింది. సాయంత్రం సమయంలో ఆరబోసిన ధాన్యాన్ని కుప్పగా చేస్తుండగా నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్‌కు వెళ్తున్న మిద్దె రాములు బైక్ ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి వాహనదారుడిని అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉమ్మడి జిల్లాలో రూ.6.61 లక్షల పట్టివేత


దాబాలో మద్యం పట్టుకున్న పోలీసులు


వనపర్తి మండలం చిట్యాల వద్ద సీజ్ చేసిన నగదును చూపుతున్న పోలీసులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.6.61 లక్షలు పట్టుబడ్డాయి.

కృష్ణా చెక్‌పోస్ట్ వద్ద రూ.90 వేల పట్టివేత

కృష్ణా: కృష్ణా బ్రిడ్జి చెక్‌పోస్ట్ వద్ద కృష్ణా పోలీసులు, ఎస్ఎస్‌టీ టీ పోలీసులు వాహనాల తనిఖీల్లో సైదాపూర్ నుంచి రాయచూర్ వెళ్తున్న రమేష్ కారులో రూ.90 వేల నగదును పట్టుకున్నారు. వాటికి తగిన రసీదు లేనందున అమౌంట్ సీజ్ చేశామని కృష్ణా ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. అదే విధంగా కృష్ణా పోలీసులు, ఎస్ఎస్‌టీ టీ పోలీసులు దాబాలపై దాడులు నిర్వహించగా ఆర్యన్‌దాబాలో రూ.4 వేల విలువ చేసే మద్యాన్ని పట్టుకుని సీజ్ చేశామని చెప్పారు.

రూ.1.50లక్షల సీజ్

నారాయణపేట రూరల్: ఎన్నికల కోడ్ సందర్భంగా జిల్లా సరిహద్దులోని జలాల్‌పూర్ చెక్‌పోస్టులో పోలీసులు ఆదివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ నుంచి నారాయణపేటకు వస్తున్న కారులో రూ.1.50 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. అందుకు సంబంధించి వాహన యజమాని విజయేందర్‌ను రసీదులు చూయించాల్సిందిగా కోరగా.. ఎలాంటి ఆధారాలు లేనట్లు ధ్రువీకరించారు. దీంతో వాటిని సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి పంపించారు. ఈ తనిఖీలో సీఐ రవిబాబు, ఎస్‌ఐ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నగదు పట్టివేత

కల్వకుర్తి టౌన్: పట్టణంలో నాగర్‌కర్నూల్ రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.2 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్మన్‌ఘాట్‌కు చెందిన కరుణ వద్ద రూ.లక్ష, అదే విధంగా నాగర్‌కర్నూల్‌కు చెందిన రోహిత్ కుమార్ వద్ద రూ.50 వేలు, వనపర్తికి చెందిన శ్రీకాంత్ వద్ద రూ.50 వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు. వారి వద్ద డబ్బులకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో డబ్బులను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

రూ.2 లక్షల నగదు స్వాధీనం

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద ఆదివారం పోలీసుల తనిఖీల్లో రూ.2 లక్షల నగదు పట్టుబడింది. వనపర్తికి చెందిన అశోక్ కారులో రూ.లక్ష నగదును తీసుకుని హైదరాబాద్‌కు వెళ్తుండగా టోల్‌ప్లాజా వద్ద చేపట్టిన పోలీసుల తనిఖీల్లో నగదు పట్టుబడింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా గుంతకల్‌కు చెందిన నాగేందర్‌రెడ్డి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా తనిఖీలు చేసిన పోలీసులకు రూ.లక్ష నగదు పట్టుబడింది. ఇద్దరి వద్ద రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు.

వనపర్తి జిల్లాలో రూ.1.21లక్షలు..

వనపర్తి: జిల్లావ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఆరు నుంచి రాత్రి పది వరకు నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.1.21 లక్షల నగదు, 108 లీటర్ల మద్యం పట్టుబడింది. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా నిర్వహించిన వాహన తనిఖీల్లో వనపర్తి మండలం చిట్యాల శివారులో మోటర్‌సైకిల్‌పై ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.70 వేల నగదు, గోపాల్‌పేట మండలం బుద్దారంగండి చెక్‌పోస్టు వద్ద రూ.51,600 నగదు, పెద్దమందడి, కొత్తకోట పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాలపై తరలిస్తున్న 106 లీటర్ల మద్యం, ఖిల్లాఘనపురం నుంచి వనపర్తికి మోటర్‌సైకిల్‌పై తరలిస్తున్న రెండు లీటర్ల సారాను పోలీసులు సీజ్ చేశారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

గద్వాల క్రైం: పురుగుమందు తాగి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి ఆదివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. అయన కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని వెంకటరమణ కాలనీకి చెందిన శేఖర్ (30) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం భార్యాభర్తలు గొడవపడ్డారు. తీవ్ర మనస్తాపానికి గురైన శేఖర్ అదేరోజు మధ్యాహ్నం జమిచేడ్ శివారులో పురుగుమందు తాగాడు. గుర్తించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి.. పరిస్థితి విషమంగా ఉండటంతో అటు నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. తల్లి వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉద్యోగం పేరుతో రూ.94 వేలు టోకరా..

అచ్చంపేట రూరల్: సైబర్ నేరగాళ్లు రోజుకో విధంగా అమాయక ప్రజలు, నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. అచ్చంపేటలోని ఓ కాలనీకి చెందిన శివప్రసాద్ సైబర్ ఉచ్చులో పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. శివప్రసాద్ కొంతకాలంగా ఉద్యోగ వేటలో ఉన్నారు. ఈ క్రమంలో మూడు నెలల కిందట గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఉద్యోగం ఇప్పిస్తానని.. అర్హత పొందాలంటే తాను చెప్పినట్లు చేయాలని సూచించాడు. అర్హత సాధించగానే శివప్రసాద్ బ్యాంకు ఖాతాలో కొంత డబ్బు జమ కావడంతో పూర్తిగా నమ్మారు. అనంతరం ఖాతాలో కొంత డబ్బు జమ చేయాలని సూచించాడు. జమ చేసిన కొన్ని గంటల్లోనే రూ.94 వేలు ఖాతా నుంచి డ్రా అయినట్లు సమాచారం వచ్చింది. అతడికి వచ్చిన సెల్‌నంబర్‌కు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందన లేకపోవడంతో ఆదివారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ వివరించారు.

చిక్కిన చిరుత


బొలెరో వాహనంలో చిరుతను దించుతున్న క్రేన్


బోనులో చిక్కిన చిరుత

మరికల్: రెండేళ్ల నుంచి రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన చిరుత పులి ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు పెట్టిన బోనులో శనివారం రాత్రి చిక్కింది. రెండు నెలల నుంచి మరికల్ మండలం రాకొండ శివారులోని గుట్టపై ఓ చిరుత రెండు పిల్లలకు జన్మనించి అక్కడే ఉంటుంది. నిత్యం రాత్రి కాగానే వ్యవసాయ పొలాల వద్ద కట్టేసిన పశువులపై ఎక్కడో ఒక చోట దాడి చేసి ఆకలి తీర్చుకుంటుంది. చిరుత పులిని పట్టుకోవాలని పది రోజుల కిందట గ్రామస్తులు నారాయణపేట అటవీ శాఖ అధికారులను సంప్రదించారు. మూడు రోజుల కిందట రాకొండ గుట్ట సమీపంలో బోనులో మేకపిల్లను ఉంచి చిరుతను పట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఎట్టకేలకు తల్లి చిరుత బోనులో చిక్కడంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు ఆదివారం మేకపిల్లను బయటకు పంపించి క్రేన్ సాయంతో బొలెరో వాహనంలో శ్రీశైలం అడవిలోకి తరలించారు. బోనులో చిక్కిన చిరుత మండలంలో రాకొండ, పూసల్‌పహాడ్ మాద్వార్ తదితర గ్రామాల్లోని పశువులపై దాడి చేసి చంపేసిన ఘటనలు ఉన్నాయి. ఈ చిరుతకు సంబంధించిన రెండు చిరుత పిల్లలు తప్పించుకోవడంతో వాటిని కూడా పట్టుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. లేకుంటే తమ వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే భయమేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడవుల్లో వన్యప్రాణులు సంచరిస్తే తమ దృష్టికి తీసుకురావాలని అటవీశాఖ అధికారి వీణావాణి తెలియజేశారు.

అటవీ ప్రాంతంలో వదిలిన అధికారులు

లింగాల: పట్టుబడిన చిరుతను ఆదివారం అటవీ శాఖ వారు బోనులో బంధించి నల్లమల అటవీ ప్రాంతంలోని లింగాల మండలం గిరిజ గుండాల బేస్ క్యాంపు సమీపంలో అడవిలోకి వదిలిపెట్టారు.

క్లుప్తంగా...

2014 నుంచి చేయలేనిది 2023లో చేస్తారా?

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: కన్న తల్లికి అన్నం పెట్టని వాడు, చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్టుగా బీఆర్ఎస్ మేనిఫెస్టో ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఎద్దేవాచేశారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోపై అరుణ స్పందిస్తూ 2014 నుంచి కేసీఆర్ సీఎంగా ఉండి చేయలేని పనులు, 2023లో చేస్తానంటే తెలంగాణ ప్రజలు నమ్మరన్నారు. నిరుద్యోగ భృతి హామీ ఏమైపోయిందని ప్రశ్నించారు. ఇప్పుడు ఇచ్చిన హామీలు కేవలం తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేయడానికి తప్ప, నిజాయితీగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశం కేసీఆర్‌కు లేదని మండిపడ్డారు. నిరుద్యోగ యువత కోసం ప్రతి ఏడాది జాబ్ కేలండర్ విడుదల చేస్తానని చెప్పి, ఇంత వరకు దాని దిక్కు మొక్కు లేకుండా చేసిన ఘనుడు కేసీఆర్ అని ధ్వజమెత్తారు. కేసీఆర్ సర్కార్ చేసిన అభివృద్ధి ఏమి లేదు కాబట్టి, కేవలం ఉచిత పథకాలను నమ్ముకుని ఎన్నికలకు పోయేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. రేషన్ కార్డు ఉన్న వారికి ఉచితాలు ప్రకటించడం పక్కన పెట్టి, మొదట రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. ఆరోగ్య శ్రీ పథకం తెలంగాణలో అమలవుతోందా? ఒకవేళ అమలైతే, ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఎంత వరకు ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్నారో వెల్లడించాలని అరుణ డిమాండ్ చేశారు.


కాంగ్రెస్ మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇంటి స్థలాలు!

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని, ఈ విషయాన్ని శ్రీధర్‌బాబు నేతృత్వంలోని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో కమిటీకి నివేదిస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బొల్లోజు రవి, ఉపాధ్యక్షుడు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు జి.ప్రతాప్‌రెడ్డి, దండ రామకృష్ణ, సభ్యులు క్రాంతి, పోలంపల్లి ఆంజనేయులు తదితరులు ఆదివారం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని చేర్చాలని ఆయన్ను కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు పట్ల కాంగ్రెస్ సానుకూలంగా ఉందని రేవంత్ హామీనిచ్చారు.

2017లోనే 'స్కిల్' కేసు

నమోదు, దర్యాప్తు మొదలైంది అప్పుడే

- స్పష్టం చేస్తున్న కేంద్ర జీఎస్టీ డీజీ లేఖ
- అప్పట్లోనే రాష్ట్రానికి సమాచారమిచ్చినా.. కేసును తొక్కిపెట్టిన టీడీపీ సర్కారు
- పాత కేసులకు పాత చట్టమే వర్తిస్తుంది
- చంద్రబాబుకు '17ఏ'వర్తించదని నిపుణుల స్పష్టీకరణ


आसूचना महानिदेशालय
DIRECTORATE GENERAL OF GST INTELLIGENCE,
Pune Zonal Unit, 'A' Wing, 3rd Floor, GST Bhawan, Sassoon Road, Pune-411001.
F.No: DGGI/PRU/INT/42/2017
Dated 28.02.2018
To : The Principal Director General, DGGSTI, New Delhi
From: Additional Director General, DGGSTI, PZU
INCIDENT REPORT NO. 22/ST/2017-18
Name and address of the assessee | M/s Skiller Enterprises India Pvt Ltd (formerly known as PVSP IT Skills Projects Pvt Ltd) 316/274 Second Floor, West End Marg, Saidulajab, New Delhi-110030 Service Tax Registration No. AAICP2127JSD001 Range-60, Hauz Khas New Division, Central GST Delhi

స్కిల్ స్కామ్ కేసు 2017లోనే నమోదయ్యిందని కేంద్ర జీఎస్టీ డైరెక్టర్ జనరల్ 2018 ఫిబ్రవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వానికి రాసిన లేఖ

సాక్షి, అమరావతి: స్కిల్ స్కామ్ కేసులో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిన మాజీ సీఎం చంద్రబాబు 'సెక్షన్ 17ఏ'ను సాకుగా చూపిస్తూ విచారణను అడ్డుకునేందుకు పన్నిన పన్నాగం బెడిసికొట్టింది. ఈ కేసు 2020లో నమోదైందని బుకాయిస్తున్న టీడీపీ వాదనకు కేంద్ర జీఎస్టీ విభాగం లేఖ ద్వారా తెర దించింది. టీడీపీ సర్కారు హయాంలోనే స్కిల్ స్కామ్ మూలాలు వెలుగులోకి వచ్చాయని, దీనిపై 2017లోనే కేసు నమోదైందని ఆ లేఖలో స్పష్టం చేసింది. జీఎస్టీ విభాగం లేఖ వెలుగులోకి రావడంతో ఈ కేసులో కీలక ప్రశ్నలకు సమాధానాలు దొరికినట్లైంది.

సాంకేతిక సాకు ఎత్తుగడ

స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్ట్ చేయాలంటే గవర్నర్ అనుమతి అవసరమంటూ టీడీపీ వ్యూహాత్మకంగా ఓ ప్రచారాన్ని తెరపైకి తెచ్చింది. సీమెన్స్‌కు తెలియకుండా, ఆ కంపెనీ ముసుగులో సాగించిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు ఎలాంటి అవినీతికి పాల్పడలేదని టీడీపీ గానీ ఆయన న్యాయవాదులు గానీ చెప్పే సాహసం చేయలేకపోతున్నారు. 2018 నవంబరు నుంచి అమలులోకి వచ్చిన 17 ఏ సెక్షన్ ప్రకారం చంద్రబాబుకు రాజ్యాంగ రక్షణ లభిస్తుందని మాత్రమే అడ్డగోలుగా వాదిస్తున్నారు.

2017లోనే కేసు నమోదు..

చంద్రబాబు బృందం ఎతుగడలను కేంద్ర జీఎస్టీ విజిలెన్స్ విభాగం చిత్తు చేసింది. ఈమేరకు కేంద్ర జీఎస్టీ డైరెక్టర్ జనరల్ (డీజీ) రాసిన లేఖ తాజాగా వెలుగులోకి రావడంతో టీడీపీ పన్నాగం బెడిసి కొట్టింది. స్కిల్ స్కామ్ కేసు 2017లోనే నమోదై దర్యాప్తు కూడా అప్పుడే మొదలైనట్లు స్పష్టమైంది. కాబట్టి చంద్రబాబుకు సెక్షన్ 17ఏ వర్తించదని తేటతెల్లమైంది. 2017 మేలో పుణెలో కొన్ని షెల్ కంపెనీల్లో నిర్వహించిన తనిఖీల్లో జీఎస్టీ విభాగం భారీ అక్రమాలను గుర్తించింది. నకిలీ ఇన్వాయిస్‌లతో జీఎస్టీ ఎగవేతకు పాల్పడ్డ కంపెనీలను గుర్తించి విస్తృతంగా సోదాలు జరిపింది. వీటిలో స్కిల్లర్ అనే కంపెనీ కూడా ఉంది. దీనిపై నాడే తీగలాగడంతో చంద్రబాబు ప్రభుత్వ అవినీతి డొంకంతా కదిలింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు (ఏపీఎస్ఎస్‌డీసీ) పరికరాలను సరఫరా చేసినట్లు చూపించేందుకు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించినట్లు తేలింది. ఆ ఇన్వాయిస్‌లను చూపించే ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి నిధులు పొందినట్లు నిర్ధారణ అయింది. దీనిపై జీఎస్టీ విభాగం 2017 మే నెలలోనే కేసు నమోదు చేసింది. పూర్తి స్థాయిలో విచారించి ఆధారాలతో సహా కుంభకోణాన్ని బట్టబయలు చేసింది.

పాత కేసులకు పాత చట్టమే

ఏపీఎస్ఎస్‌డీసీ నిధులు దారి మళ్లడంపై విచారించాలని సూచిస్తూ ఏపీ ఏసీబీ విభాగానికి 2018 ఫిబ్రవరిలోనే సమాచారం ఇచ్చింది. ఈమేరకు కేంద్ర జీఎస్టీ ఇంటలిజెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ లేఖ రాశారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. చంద్రబాబు ఒత్తిడితో ఏసీబీ విభాగం ఆ కేసును తొక్కిపెట్టింది. అంటే స్కిల్ స్కామ్ బయటపడిందీ... కేసు నమోదైంది 2017లోనే అని స్పష్టమవుతోంది. అప్పటికి 17ఏ సెక్షన్ అమలులోకి రాలేదు. ఆ సెక్షన్ 2018 జూలైలో చేయగా 2018 నవంబరు నుంచి అమలులోకి వచ్చింది. కాబట్టి స్కిల్ స్కామ్ కేసులో నిందితుడు చంద్రబాబుకు 17ఏ సెక్షన్ కింద రక్షణ లభించదన్నది నిర్ధారణ అయినట్టేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పాత కేసులకు పాత చట్టమే వర్తిస్తుందని తేల్చి చెబుతున్నారు. అవినీతికి పాల్పడి ఆధారాలతోసహా అడ్డంగా దొరికిన చంద్రబాబు సాంకేతిక సాకులతో తప్పించుకునేందుకు చేస్తున్న యత్నాలు ఫలించవని వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్ర జీఎస్టీ ఇంటలిజెన్స్ విభాగం డీజీ లేఖతో చంద్రబాబు కుట్ర బెడిసికొట్టినట్టేనని చెబుతున్నారు.

శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేందర్‌నాథ్‌రాయ్, జస్టిస్ రవీంద్రబాబు, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.



ఆలయం వెలుపల జస్టిస్ మానవేందర్‌నాథ్ రాయ్





కుటుంబ సభ్యులతో జస్టిస్ రవీంద్రబాబు, కుటుంబ సభ్యులతో జస్టిస్ గోపాలకృష్ణారావు

పెట్టుబడుల పరుగులు..

- ఏపీలో మరో రూ.1,624 కోట్లు వాస్తవ రూపంలోకి..
- నేడు సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా నాలుగు యూనిట్ల ప్రారంభోత్సవాలు..



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ఏపీ ప్రభుత్వం కృషి ఫలితంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మరో రూ.1,624 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల పర్యటనలో పలు ఐటీ, ఫార్మా కంపెనీల ప్రారంభోత్సవాలు, భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధానంగా విశాఖలో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు ఐజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, లారస్ సింథసిస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమి టెడ్, లారస్ ల్యాబ్‌లను ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 4,160 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. సీఎం సోమవారం ప్రారంభించే, భూమి పూజ నిర్వహించే యూనిట్ల వివరాలివీ..

ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్..

విశాఖపట్నంలోని మధురవాడ ఐటీ హిల్ నెంబర్–2లో ఇన్ఫోసిస్ ఒక కొత్త డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేసింది. సుమారు రూ.41కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసిన ఈ సెంటర్‌ను భవిష్యత్తులో మరింత విస్తరించనున్నారు. ఇది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా పనిచేస్తుంది. దీని ఇంటీరియర్ డిజైన్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైబ్రీడ్ వర్క్‌ప్లేస్‌గా రూపొందించారు. దాదాపు వెయ్యి మంది ఈ సెంటర్ నుంచి పనిచేయనున్నారు.

ఐజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్..

ఫార్మా, బయోటెక్ ఉత్పత్తులకు సంబంధించి రూ.300.78 కోట్లతో పరవాడ ఫార్మాసిటీలో నిర్మించిన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ ఐజియా (ఈయూఐజీఐఏ) యూనిట్‌ను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించనున్నారు. ఈ యూనిట్ ద్వారా 800 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.

లారస్ సింథసిస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్..

యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్ (ఏపీఐ) ఉత్పత్తులకు సంబంధించి రూ.421.70 కోట్లతో అచ్యుతాపురంలో నిర్మించిన ఈ యూనిట్‌ను సీఎం ప్రారంభిస్తారు. దీని ద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాల కల్పన జరగనుంది. ఇదే కంపెనీ మరో 15 ఎకరాల్లో రూ.407.40 కోట్లతో ఏర్పాటు చేసే యూనిట్ నిర్మాణ పనులకు కూడా సీఎం భూమిపూజ చేస్తారు.

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్..

అచ్యుతాపురం ఏపీ సెజ్‌లోని లారస్ ల్యాబ్స్‌లో నిర్మించిన అదనపు భవన సముదాయాన్ని, యూనిట్–2 ఫార్ములేషన్ బ్లాక్‌ను కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. రూ.460 కోట్లతో ఏర్పాటుచేసిన ఈ యూనిట్ ద్వారా 1,200 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. దీంతోపాటు రూ.407.40 కోట్లతో లారస్ ల్యాబ్స్ కొత్త పరిశ్రమకు కూడా సీఎం భూమిపూజ చేస్తారు. బీచ్ క్లీనింగ్ కోసం జీవీఎంసీ కొనుగోలు చేసిన ప్రత్యేక వాహనాల్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

వాళ్లు చస్తే నా డబ్బులతో బీమా చెల్లిస్తా..

- సీఎం కుటుంబంపై ఎంపీ అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ మేనిఫెస్టో చించివేత



డిచ్‌పల్లి (నిజామాబాద్‌రూరల్): సీఎం కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్, కూతురు కవిత చనిపోతే తన సొంత డబ్బులతో ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రూ.15 లక్షలు బీమా కింద ఆ కుటుంబానికి చెల్లిస్తానని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పైవిధంగా వ్యాఖ్యలు చేశారు. తెల్ల రేషన్‌కార్డుదారులు చనిపోతే రూ.5 లక్షల బీమా ఇస్తామని బీఆర్ఎస్ ప్రకటించడంపై మండిపడ్డారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయని సీఎం కేసీఆర్.. ఇప్పుడు ప్రకటించిన కొత్త హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఇదొక చెత్త మేనిఫెస్టో అంటూ బీఆర్ఎస్ మేనిఫెస్టోను ఎంపీ చించివేశారు. గతంలో తనను చెప్పుతో కొడతానని ఎమ్మెల్సీ కవిత అన్నారని, ఆమెను నలిపి బయటపడేస్తానని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం కేసీఆర్ కంటే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పెద్ద అవినీతిపరుడని, కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రం పాతాళానికి పోతుందన్నారు. ఒకవేళ రాష్ట్రంలో హంగ్ వచ్చినా బీజేపీదే అధికారమని అర్వింద్ అన్నారు.

బీజేపీ టికెట్‌పై మునుగోడు నుంచే పోటీ: రాజగోపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో తాను బీజేపీ టికెట్‌పై మునుగోడు నుంచే పోటీ చేస్తానని బీజేపీ నేత, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలను నమ్మరని, వాళ్లిద్దరూ ఒక్కటేనన్నారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకే పార్టీనని 2018 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరడమే ఇందుకు తార్కాణమన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో తాను ఓడిపోయినప్పటికీ తనకు 87 వేల ఓట్లు వేసి నైతిక విజయం మునుగోడు ప్రజలు ఇచ్చారన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



శాంతినగర్: ఆటోలో ప్రయాణించిన సమయంలో బ్యాగును పోగొట్టుకున్న మహిళకు తిరిగి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. శాంతినగర్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా.. మానవపాడు మండలం ఏ.బూడిదపాడు గ్రామానికి చెందిన సుకన్య అలంపూర్‌చౌరస్తాలో శాంతినగర్‌కు చెందిన ఆటో ఎక్కింది. కలుకుంట్లలో ఆటో దిగింది. హ్యాండ్‌బ్యాగు మరిచి స్వగ్రామమైన బూడిదపాడుకు వెళ్లిపోయింది. బ్యాగులో 8 తులాల బంగారు ఆభరణాలు, ఫోన్‌తోపాటు కొంత నగదు ఉండటంతో ఆందోళనకుగురైంది. వెంటనే ఫిర్యాదు చేయడానికి శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. ఫిర్యాదు చేయకముందే ఆటో డ్రైవర్ శేక్షా తన ఆటోలో ఎవరో బ్యాగు మరిచిపోయారని పోలీసులకు అందజేశాడు. బాధితురాలికి బ్యాగును చూపగా తనదేనని చెప్పడంతో బ్యాగు తెరిచి అన్ని వస్తువులు ఉన్నాయని చెప్పడంతో ఆటో డ్రైవర్‌కు సుకన్య కృతజ్ఞతలు తెలిపింది. నిజాయితీగా బ్యాగు తెచ్చి ఇచ్చిన డ్రైవర్‌ను ఎస్ఐ అభినందించారు.

రామన్‌పాడులో పూర్తి స్థాయి నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో ఆదివారం 1,021 అడుగులకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,250, సమాంతర కాల్వ ద్వారా 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,250, కుడి కాల్వ ద్వారా 10, ఎడమ కాల్వ ద్వారా 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్–2 ద్వారా 855 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

జోగుళాంబ.. నమోస్తుతే

వైభవంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

- తొలిరోజు ఆనతి స్వీకరణ, ఆలయ ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, మహా కలశ స్థాపన, ధ్వజారోహణం
- తొలిరోజు శైలపుత్రిగా దర్శనం



రథోత్సవంలో న్యాయమూర్తి దంపతులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జయతు జయతు జోగుళాంబా నీకు స్వాగతం.. సుస్వాగతం అంటూ భక్తులు శరన్నవరాత్రులకు స్వాగతం పలుకుతూ దీక్షబూనారు. ఉదయం ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, ఆలయ చైర్మన్ చిన్ని కృష్ణయ్య, పాలకమండలి సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, కేశన్న, నీలప్ప, అడవప్ప, అంపయ్య, వెంకటేష్, ఆనంద్‌శర్మ మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ సంకల్పం చేసి ఉత్సవాలకు ఆనతి స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఈఓ, చైర్మన్ పట్టువస్త్రాలు, మంగళ ద్రవ్యాలతో పల్లకీలో ఉత్సవ బలిభేరి, గోమాత సహితంగా జోగుళాంబ ఆలయానికి చేరుకున్నారు.

యాగశాల ప్రవేశం..

ఉత్సవ బలిభేరితో అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు యాగశాల ప్రవేశం చేశారు. గణపతి పూజలు, రుత్విక్ వరుణం, మహా కలశస్థాపన, పుణ్యాహ వాచనం, దీక్షాధారణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను ధార్మిక పద్ధతిలో విజయవంతం చేస్తామని ఆలయ అధికారులతో రుత్విక్కులు మహా సంకల్పం పఠింపజేశారు. అదేవిధంగా యాగశాలలో మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి రూపాలతో మూడు కలశాలు.. నవగ్రహ మండపం, వాస్తు మండపం, చతుర్‌షష్టియోగిని, అష్టదిక్పాలక మండపాలు ప్రతిష్ఠించారు.



జోగుళాంబ అమ్మవారు

సర్వతోబద్ర మండపంపై ప్రధాన కలశాలను ఆవహన చేశారు. యాగశాలలో ప్రతిరోజు చండీ హోమాలు, మధ్యాహ్నం మూలవిరాట్‌కు నవాన్న నైవేద్యాలు, త్రికాల సమయంలో బలిహరణం చేస్తున్నారు.

భక్తుల దీక్షాధారణ..

ఉత్సవాల సందర్భంగా స్థానిక, స్థానికేతర భక్తులు జోగుళాంబ దీక్ష చేపట్టారు. ఎరుపురంగు దుస్తులు ధరించి మాలధారణ చేశారు. ఆలయ అర్చకుడు జయంతి శ్రీనివాస్‌శర్మ మాలధారణ చేయించారు. దీక్షాదారులకు బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భోజనం, ఉండటానికి వసతి కల్పించారు. తొలిరోజు ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఇదిలా ఉండగా ప్రదోశ కాలంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ ఆవరణలో త్రిశతి, ఖడ్గమాల, నవావరణ అర్చనలు చేశారు.



ఆనతి స్వీకరణోత్సవంలో ఆలయ బృందం

ధ్వజారోహణం..

ఉత్సవాల తొలిరోజు ఆదివారం ప్రదోశ కాలంలో అమ్మవారి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి ధ్వజారోహణం చేశారు. అదేవిధంగా అమ్మవారికి దశవిధ హారతులిచ్చారు.

శైలపుత్రిగా దర్శనం..

జోగుళాంబ అమ్మవారు తొలిరోజు శైలపుత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సువాసిని, కుమారి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని ధ్వజమండపం వద్ద ప్రతిరోజు ప్రదోశకాలంలో దర్బార్‌సేవతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



ఖిల్లాఘనపురంలో ఖోఖో పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైన బాలుర జట్టు

ఖిల్లాఘనపురం: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచిన జాతీయస్థాయిలో సత్తా చాటాలని వనపర్తి జిల్లా విద్యాశాఖ అధికారి నరహరి అన్నారు. మండలంలోని సోళీపురంలో ఈ నెల 13న ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ అండర్–17 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ హాజరయ్యారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేందర్‌రెడ్డి, టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మన్యంతో కలిసి ఆయన మెమోంటోలను అందజేశారు. డీఈఓ మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన విద్యార్థులు ఎంతో మంది దేశ సేవలో ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి 10 జట్లు బాలికలు, 10 జట్లు బాలురు పోటీల్లో పాల్గొన్నాయన్నారు. టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మన్యం మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో బాలికలు ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా నిలవగా, ద్వితీయ స్థానంలో హైదరాబాద్, తృతీయ స్థానంలో నల్లగొండ ఉమ్మడి జిల్లా నిలిచినట్లు తెలిపారు. బాలురలో ప్రథమ స్థానం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా, ద్వితీయ స్థానంలో రంగారెడ్డి జిల్లా, తృతీయ స్థానంలో వరంగల్ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు నిలిచారన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన బాలికల ఖోఖో జట్టు..

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో భాగంగా జాతీయ స్థాయికి ఆడబోయే జట్లను నిర్వాహకులు ఎంపిక చేశారు. బాలికల జట్టులో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా నుంచి అంకిత, హేమలత, శ్రావణి, మాధవి, హైదరాబాద్ నుంచి కీర్తన, అర్చన, క్రిశిత, నల్లగొండ నుంచి వైశాలి, సంజన, రంగారెడ్డి జిల్లా నుంచి స్రవంతి, మెదక్ నుంచి స్రవంతి, వరంగల్ నుంచి అనిత జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రకటించారు.

బాలుర ఖోఖో జట్టు..

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా నుంచి పవన్, ఆదిలాబాద్ నుంచి నరేష్, నవీన్, సంపత్‌నాయక్, రంగారెడ్డి జిల్లా నుంచి శ్రవణ్‌కుమార్, సురేష్, సాయికుమార్, వరంగల్ నుంచి పాండు, గణేష్, నల్లగొండ నుంచి దత్తు, హైదరాబాద్ నుంచి వెంకటసాయి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో నర్సింహయాదవ్, శ్యాంప్రసాద్, నిరంజన్, విలియం, అనిల్, దేవేందర్, ఈశ్వరమ్మ, నిరంజన్‌గౌడ్, తిరుపతి, వెంకట్, వహీదా, రామ్మోహన్, గోవింద్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన ఉమ్మడి పాలమూరు బాలికల జట్టు

రసవత్తరంగా జోనల్ స్థాయి క్రీడా పోటీలు..



అచ్చంపేటలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు మూడో రోజు ఆదివారం రసవత్తరంగా కొనసాగాయి. ఖోఖో అండర్–17, 14లో జేపీ నగర్, ఫుట్‌బాల్ అండర్– 17లో వీపనగండ్ల, చెస్‌లో అండర్–19 విభాగంలో లింగాల మొదటిస్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో డీసీఓ దానమయ్య, ప్రిన్సిపాల్ రాములు, వైస్ ప్రిన్సిపాల్ మధుసూదన్, ఆర్ఎస్ఓ వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, పీడీ షంషీర్‌అలీ, లెక్చరర్లు రవిశంకర్ శెట్టి, మనోహర్, శివ పాల్గొన్నారు.

ప్రతి ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్తగా మారాలి

- భారత విద్యా హక్కుల చైర్మన్, ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్



మాట్లాడుతున్న జగ్‌మోహన్‌సింగ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సమాజంలో రుగ్మతలను రూపుమాపేందుకు ప్రతి ఉపాధ్యాయుడు ఒక సామాజిక కార్యకర్తలా మారాలని భారత విద్యా హక్కుల చైర్మన్, ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడాలంటే విద్య అనేది ప్రతి వ్యక్తికి మంచి శక్తినిచ్చే ఔషధంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. మౌళిక రంగంలో సమూల మార్పులు రావాలంటే విప్లవ కాంక్షతో కూడిన ఉద్యమాలు మాత్రమే పరిష్కారం చూపగలవన్నారు. సామ్రాజ్యవాదం ప్రస్తుతం రూపుమార్చుకుందని, అది వ్యక్తులు సమాజాన్ని వేరు చేస్తూ, ప్రభుత్వం తన ప్రయోజనాలను నెరవేర్చుకుంటుందని విమర్శించారు. ఇలాంటి ధోరణులను మార్చాల్సిన అవసరం ఉందని, పేదలకు ఉచితంగా సమానమైన విద్య అందినప్పుడు మాత్రమే సమాజంలో అంతరాలు తొలగిపోతాయన్నారు.

విలువలు కోల్పోయిన రాజకీయం..

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయం పూర్తిగా విలువలు కోల్పోయిందని, అధికారం కోసం.. సీట్ల కోసం హడావుడిగా పోటీ పడుతున్నారన్నారు. భగత్‌సింగ్ లాంటి వాళ్లు దేశం కోసం ప్రాణాలర్పిస్తే.. ప్రస్తుత వ్యక్తులకు సామాజిక బాధ్యత లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వమే ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించి, వాటిలో విద్యార్థులను చేర్పించి ఫీజులు కడుతుందని, అందులో భాగంగా రూ.5 వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించాలని ప్రైవేటు సంస్థలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. కానీ, పాలమూరు యూనివర్సిటీ వంటి వాటికి నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం ఆలోచించే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, వామన్ కుమార్, శేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పాశం యాదగిరి, వేణుగోపాల్, వికాస్‌గుప్తా పాల్గొన్నారు.